## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక

**పూసపాటిరేగ:** వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు రాయితీపై రుణాలు అందించేందుకు (2024 – 25) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.రాధిక తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాలలో స్వయం ఉపాధి పొందేందుకు రుణాలు అందించనున్నట్లు చెప్పారు. 50 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తామని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, రవి, శేఖర్, రమేష్‌తో పాటు పలువురు బ్యాంకర్లు పాల్గొన్నారు.

### ఇంటర్ ప్రవేశాలకు..

**డెంకాడ:** మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి మే 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీలు 150 రూపాయలను ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు.

### హైమాస్ట్ లైట్ ప్రారంభం



విద్యుత్ దీపాన్ని వెలిగిస్తున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

**విజయనగరం:** నగర అందాలను మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. స్థానిక అంబటిసత్రం జంక్షన్‌లో రూ. 1.25 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ సాధారణ నిధులతో లైట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఈఈ రాయల్‌బాబు, డీఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించాల్సిందే ..

• ఎస్సై సన్యాసినాయుడు



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై సన్యాసినాయుడు

**డెంకాడ:** హాస్టల్ నిర్వహణ నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని మెర్సీ మిషన్ పాఠశాలలో ఉన్న హాస్టల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతూ, పరిస్థితులపై ఆరా తీశారు. వసతిగృహంలోని ముఖ్య కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

### జాబ్‌మేళా రేపు

**విజయనగరం అర్బన్:** పట్టణంలోని వికాస్ – ఏజీఎల్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ శీర రవికిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసాన్ ఎక్స్‌పీరియన్స్ కంపెనీలో టెలీ సేల్స్ రిప్రజెంటేటివ్, ఐసీఐసీఐ బ్యాంకుల్లో రిలేషన్‌షిప్ మేనేజర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ప్రొడక్షన్, మెయింటెనెన్స్ ట్రైనీలు, జూనియర్ ఇంజినీర్, సీనియర్ ఇంజినీర్, జూనియర్, సీనియర్ కెమిస్ట్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్, రిలేషన్‌షిప్ మేనేజర్, ఇసుజు మోటార్స్, ఇండో ఎంఐఎం, పానాసోనిక్, హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. 35 సంవత్సరాలోపున్న పది, ఇంటర్, ఐటీఐ డిప్లమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన వారు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 70366 67882, 77993 76333 నంబర్లను సంప్రదించాలన్నారు.

### 'గేట్'లో పట్టణ విద్యార్థికి 70వ ర్యాంక్

**విజయనగరం అర్బన్:** గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్-2025) ఫలితాల్లో పట్టణ విద్యార్థి రాపర్తి రాంచైతన్య జాతీయ ర్యాంక్ 70 సాధించాడు. ఈ మేరకు బుధవారం ఫలితాలు జాతీయస్థాయిలో విడుదల కాగా గేట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ సబ్జెక్టులో 70వ ర్యాంక్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 138 ర్యాంక్‌లను సాధించాడు. పట్టణంలోని సిద్ధార్థ నగర్(తోటపాలెం)కు చెందిన రామ్‌చైతన్య నాగపూర్ ఎన్ఐటీలో బీటెక్ చదివాడు. తండ్రి వెంకట్రావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి లక్ష్మి పద్మావతి గృహిణి.

---

• పెరగనున్న ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
• ఆహార నియమాలు పాటించకపోతే శరీరం డీహైడ్రేడ్ అయ్యే అవకాశం

# సమతుల ఆహారం.. తప్పనిసరి



**పూసపాటిరేగ:** మార్చి మొదటి వారం నుంచే ఎండల తీవ్రత పెరిగింది. ప్రతి ఏడాది కంటే ఈ ఏడాది ముందుగానే ఎండలు రావడంతో రాబోయే రోజులలో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు ముందుగానే హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వేసవికాలంలో తీసుకునే ఆహారమే కీలకమని వైద్యులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. చెమట అధికంగా ఉత్పన్నమై లవణాలు తగ్గిపోతే వడదెబ్బ సోకే అవకాశం ఉందని గోవిందపురం పీహెచ్‌సీ డాక్టర్ ఏపీ సుధారెడ్డి సూచిస్తున్నారు. వేసవితాపాన్ని తట్టుకోలేక చాలా మంది చల్లని ద్రవ పదార్థాలు తీసుకోవడానికి ఇష్టపడతారు. అలాగే వేసవిలో చర్మవ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. వీటన్నింటినీ తట్టుకోవడానికి రోగ నిరోధక శక్తి పెంచే విధంగా ప్రతిఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలి. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడుతుందనే ఆలోచన కలిగి ఉండాలి.

#### ఖనిజ లవణాలుండే ఆహారం..

ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తిని బలోపేతం చేసుకోవాలి. తీసుకునే ఆహారంలో ఖనిజ లవణాలు అధికంగా ఉండేలా చూడాలి. పాలు, గుడ్లు, టమాటా, చిలగడ దుంప, చేపలు తినడం మంచిది. ఆహారంలో సొరకాయ, బీరకాయ, దోసకాయ, పొట్లకాయ, పాలకూర, తోటకూర, తదితర కూరలు వినియోగించినట్లయితే ఆరోగ్యంగా ఉండవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

#### పండ్లు మేలు..

ప్రతిరోజూ ఎక్కువ పోషకాలుండే పండ్లను తీసుకోవాలి. బొప్పాయి, జామి, అరటి, యాపిల్, పుచ్చకాయ, కర్బూజ వంటి పండ్లు తీసుకోవడం మంచిది. బత్తాయి, కమల, నారింజ, నిమ్మరసాలు తాగినట్లయితే వడదెబ్బను తట్టుకోవచ్చును. రాగులు, సామలు, కొర్రలు, జొన్నలు వంటి చిరు ధాన్యాలు తీసుకున్నట్లయితే ఆరోగ్యానికి ప్రయోజనం ఉంటుంది. ఎండలలో ఎక్కువగా తిరిగే వ్యక్తులు ద్రవపదార్థాలను తీసుకోవాలి. మజ్జిగ, కొబ్బరినీరు, లస్సీ, చెరుకు రసం అధికంగా వినియోగించినట్లయితే ఇబ్బందులుండవు. మజ్జిగ శరీరంలో జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే కొబ్బరినీరు ఎక్కువగా తీసుకున్నట్లయితే శరీరానికి ఎంతో శక్తి లభిస్తుంది. శరీరంలో 60 నుంచి 70 శాతం వరకు నీరు ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలను తగ్గించడంలో నీరు ప్రముఖపాత్ర పోషిస్తుంది. ప్రతి మనిషి రోజుకు సగటున 3 నుంచి 4 లీటర్ల నీటిని తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు డీహైడ్రేషన్‌కు గురవకుండా ఉండవచ్చన్నారు. నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది.



#### ఆహార నియమాలు పాటించాలి

ప్రతి ఒక్కరూ అవసరమైతే తప్ప బయటకు రాకుండా ఉండడం మంచిది. తలపై రక్షణకు గొడుగు లేదా టోపీ ధరించాలి. వదులుగా వున్న చేనేత వస్త్రాలు వేసుకోవాలి. ఎక్కువ నీరు తీసుకోవడంతో పాటు ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేస్తే ఆరోగ్యం నిలకడగా ఉంటుంది.
– ఏపీ సుధారెడ్డి, వైద్యాధికారి, గోవిందపురం పీహెచ్‌సీ



## ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంఓ కంది ధర్మకుమార్

• అకడమిక్ మానటరింగ్ అధికారి ధర్మకుమార్

**డెంకాడ:** పదో తరగతి, ఇంటర్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా అందరూ కృషి చేయాలని అకడమిక్ మానటరింగ్ అధికారి కంది ధర్మకుమార్ అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎం.సెట్, నీట్ కోచింగ్ ఇవ్వాలన్నారు. యుడైస్ ప్లస్‌లో స్టూడెంట్ ఇన్ఫో రిజిస్టరై ఉన్నందున శతశాతం హాజరు ఉండాలన్నారు. 6వ తరగతి, ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలు ఎక్కువగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఈకేవైసీ తప్పనిసరి

**భోగాపురం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రేషన్‌కార్డులు కలిగి ఉన్న లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఈ నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని సీఎస్‌డీటీ మురళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు ఇంకా ఈకేవైసీ చేయించుకోని వారు సమీపంలోని రేషన్‌డిపో లేదా సచివాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

### వాత్సల్య కార్యక్రమంపై అవగాహన



వాత్సల్య కార్యక్రమంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఉమెన్ ప్రొటెక్షన్ పోలీసులు

**విజయనగరం:** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ సచివాలయాల్లో వాత్సల్య కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు. ఉమెన్ ప్రొటెక్షన్ పోలీస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలు అరికట్టడం, అనాథ పిల్లలను గుర్తించడం, బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం, కర్మాగారాలు, ఇతర చోట్ల బాలికలు పనిచేస్తున్నట్లయితే గుర్తించడం, లైంగిక వేధింపులకు గురికాకుండా చూడడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమెన్ ప్రొటెక్షన్ పోలీసులతో పాటు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

### సీతమ్మవారి మంగళసూత్రాలకు బంగారం వితరణ

**లక్కవరపుకోట:** రంగారాయపురంలోని రామాలయంలో సీతమ్మవారికి మంగళసూత్రాలు తయారీ నిమిత్తం ఆ గ్రామానికి చెందిన గేదెల సీతారాం కుటుంబ సభ్యులు అరతులం బంగారు వితరణ చేశారు. బంగారాన్ని మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. శ్రీరామనవమి నాటికి అమ్మవారికి మంగళసూత్రాలు తయారు చేయించాలని ఆలయకమిటీకి దాతలు సూచించారు.

## విమానాశ్రయ అప్రోచ్ రోడ్డు పరిశీలన



అప్రోచ్ రోడ్‌కు సంబంధించిన భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాట్ల కీర్తి

**భోగాపురం:** రాయివలస ట్రంపెట్ నుంచి విమానాశ్రయం వరకు నిర్మిస్తున్న అప్రోచ్ రోడ్‌కు సంబంధించిన భూములను ఆర్డీఓ దాట్ల కీర్తి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఐదు గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతూ.. తమ పొలాలకు వెళ్లేదారి లేకుండా అప్రోచ్ రోడ్ పొడవునా ఫెన్సింగ్ వేస్తే తమ పొలాలలోకి ఎలా వెళ్లి వ్యవసాయం చేయాలంటూ తమ సమస్యను ఆర్డీఓ దాట్ల కీర్తి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. సురేష్, సర్పంచ్‌లు ఉప్పాడ శివారెడ్డి, విజయభాస్కరరెడ్డి, మట్టా అయ్యప్ప, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ



ధ్రువపత్రాలతో శిక్షణార్థులు, అధ్యాపకులు

**విజయనగరం అర్బన్:** గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజులుగా చివరి సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన ఎంప్లాయిబిలిటీ, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణలు బుధవారంతో ముగిశాయి. నాంది ఫౌండేషన్, మహీంద్ర ప్రైడ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిక్షణలో నీడ్ అనాలసిస్, సెల్ఫ్ అవేర్‌నెస్, ప్రీ అసెస్మెంట్, గోల్ సెట్టింగ్, టైమ్ మేనేజ్‌మెంట్, గ్రీటింగ్స్, బాడీ లాంగ్వేజ్, రెజ్యూమ్ ప్రిపరేషన్, గ్రూప్ డిస్కషన్, వర్క్‌ప్లేస్ ఎతిక్స్, పార్టిసిపేషన్ ఇన్ మీటింగ్స్, క్రిటికల్ థింకింగ్ విషయాల మీద అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన ముగింపు సభలో శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. శిక్షణలో తెలుసుకున్న మెలకువలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షకులుగా కె.గౌతమ్‌శంకర్, వై. హరికుమార్ వ్యవహరించారు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 23న వయోజనులకు పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

**నెల్లిమర్ల:** వయోజనులకు ఈ నెల 23న అక్షరాస్యత పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె. రామకృష్ణరాజు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వయోజనులకు నిర్వహించనున్న పరీక్షపై సంబంధిత సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంతవరకు చదవడం, రాయడం, లెక్కలు వేయడం నేర్చుకున్న వయోజనులందరూ పరీక్షకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఉత్తీర్ణులైన వారికి జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ ధ్రువపత్రాలు అందజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్‌వీడీ సురేష్, ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.శారద, త్రినాథమ్మ, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

---

### వితరణ..



డెంకాడ మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధి గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీ షర్టులు, బూట్లు, సాక్సులు, నాప్‌కిన్స్ బుధవారం అందజేశారు. ఒక్కొక్కరికీ రెండు టీ షర్టులు, బూట్లు, తదితర వస్తువులు ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీడీ ఎస్.వరహాలు, నాంది ఫౌండేషన్ కో ఆర్డినేటర్లు మజ్జి మధు, లెంక ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. - డెంకాడ

### పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించండి..



విజయనగరం జిల్లాలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులకు బకాయి పడిన పీఎఫ్, గ్రాట్యూటీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు సుగర్ కేన్ కమిషనర్ వి. వెంకటరావును బుధవారం విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఫ్యాక్టరీ మూతపడడంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
- విజయనగరం గంటస్తంభం

### సమస్యలు పరిష్కరించాలి..



ఏపీఎస్ ఆర్టీసీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు, అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎ.జగన్ మోహనరావు కోరారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు, హెయిర్ బస్సు డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. జాయింట్ కమిషనర్, ఆర్టీసీ ఈడీ ఆదేశాల మేరకు వెంటనే ఆర్టీసీ అధికారులు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవీ రాజు, కోటి, తదితరులు పాల్గొన్నారు.
- విజయనగరం గంటస్తంభం

### నగదు వితరణ..



నెల్లిమర్ల మండలం గొర్లిపేటలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయానికి పూసపాటిరేగ మండలం కొవ్వాడ అగ్రహారం సర్పంచ్ కోట్ల రఘు 30 వేల రూపాయలను బుధవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవ కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గొర్లిపేట గ్రామస్తులు లక్ష్మీనరసింహం, నడుపూరి పరిసినాయుడు, పి. పాపునాయుడు, నడుపూరు శ్రీను, అచ్చంనాయుడు, చంద్రరావు, రామునాయుడు తదితరులున్నారు.
- పూసపాటిరేగ

## ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణం మెరుగు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**నెల్లిమర్ల:** ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఏపీసీఎన్ఎఫ్ ఎ.డి ప్రకాశరావు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ, వెలుగు ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘ మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విషపూర్తి ఎరువుల వల్ల కలిగే నష్టాలను ఎ.డి ప్రకాశరావు, ఆర్‌టీఓ హేమసుందర్ వివరించారు. నేల సారాన్ని పరిరక్షించుకోవాలంటే ప్రకృతి సాగు విధానమే మేలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ ఎం.పూర్ణిమ, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ బంగారమ్మ, ఏపీఎంలు ఎస్‌వీడీ సురేష్, ఎల్.పద్మ పాల్గొన్నారు.

### వాటర్ షెడ్డు తొలగింపు

**పూసపాటిరేగ:** మండలంలోని కనిమెల్ల గ్రామంలో గోర్జి ఆక్రమణలో ఉన్న వాటర్‌ప్లాంట్ షెడ్డును తొలగించినట్లు తహసీల్దార్ తాడ్డి గోవింద తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 61 -50లో ఉన్న ఆక్రమణలపై అందిన ఫిర్యాదు మేరకు షెడ్డు తొలగించినట్లు చెప్పారు. అలాగే రేషన్ లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.